## క్లుప్తంగా

### మహానేత విగ్రహానికి తొలగిన ముసుగు



మహానేత విగ్రహానికి ముసుగు తొలగించిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్

**పాములపాడు:** మండల కేంద్రంలోని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి ఎన్నికల సందర్భంగా ఏర్పాటు చేసిన ముసుగును అధికారులు మంగళవారం తొలగించారు. ఎన్నికల కోడ్ ముగిసినా మహానేత విగ్రహానికున్న ముసుగును తొలగించకపోవడంపై ఈ నెల 17న తొలగని ముసుగు అనే వార్త ప్రచురితమైంది. స్పందించిన ఎంపీడీఓ సరస్వతి, ఈఓపీఆర్డీ శ్రీనివాసులు నాయుడు వెంటనే ముసుగు తొలగించాలని పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్‌ను ఆదేశించారు.

### కుమారస్వామికి విశేష పూజలు



**శ్రీశైలంటెంపుల్:** శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

### అంగన్‌వాడీల సేవలు వినియోగించుకోవాలి



చిన్నారులకు ప్రీస్కూల్ సర్టిఫికెట్లను అందజేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

**మిడుతూరు :** గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలు అంగన్‌వాడీ కేంద్రాల సేవలను వినియోగించుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేణుకాదేవి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదు సంవత్సరాలు నిండిన పిల్లలకు ప్రీ స్కూల్ సర్టిఫికెట్లను పంపిణీ చేసి, 1వ తరగతిలో చేర్పించినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తే ప్రభుత్వ లక్ష్యం



విద్యార్థులకు కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

**నందికొట్కూరు రూరల్ :** పేద విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. మంగళవారం మండల పరిధిలోని అల్లూరు గ్రామంలోని ఎంపీపీ స్పెషల్ స్కూల్ ఎస్సీ కాలనీ, ఎంపీపీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్టూడెంట్స్ కిట్‌లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలలోని విద్యార్థులకు ఉన్నత చదువులు అందించే విధంగా విద్యకు ప్రాధాన్యతనిస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఎంఈవో షైజున్నిసా, నాయకులు మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### వైభవంగా స్వాతి వేడుకలు



**నంద్యాల(వ్యవసాయం):** పట్టణంలోని తెలుగుపేటలో వెలసిన మద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో మంగళవారం స్వామివారి జన్మనక్షత్రం స్వాతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి పంచామృతాభిషేకాలు, స్నపన తిరుమంజనం, పట్టు వస్త్రాల అలంకరణ చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. అదే విధంగా లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు, సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. మహానైవేద్యం సమర్పించి స్వామి, అమ్మవార్లకు మహామంగళ హారతులు ఇచ్చారు. సాయంత్రం స్వాతి పల్లకీసేవ సమితి ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లను ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు మధుసూదనరాయల్, అర్చకులు రామ్మూర్తి పాల్గొన్నారు.

## దంచికొట్టిన వాన



కపిలేశ్వరం గ్రామ సమీపంలో పంటపొలాల్లో నిలిచిన వర్షపు నీరు

**కొత్తపల్లి:** మండలంలోని ఆయా గ్రామాలలో మంగళవారం సాయంత్రం వాన దంచికొట్టింది. మండలంలోని దుద్యాల, నందికుంట, బావాపురం, ఎదురుపాడు, గోకవరం, లింగాపురం, గువ్వలకుంట్ల, వీరాపురం, కొత్తపల్లి, శివపురం, సింగరాజుపల్లె గ్రామాలలో మోస్తరు వర్షం కురిసింది. అదేవిధంగా గుమ్మడాపురం, ముసలిమడుగు, ఎర్రమఠం, కపిలేశ్వరం గ్రామాలతో పాటు పవిత్ర పుణ్యక్షేత్రమైన సప్తనది సంగమేశ్వరంలో సుమారు గంటసేపు వర్షం పడింది. దీంతో ఆయా గ్రామాల పొలాల్లో వర్షపునీరు పారింది. పంటకాల్వల్లో సైతం వర్షం నీరు ఏరులా పారింది. దీంతో ముందస్తుగా పంటలు సాగుచేసుకొన్న పంటలకు ఈ వర్షం జీవం పోసినట్లు అయ్యింది. ఖరీఫ్ సీజన్ సాగుచేసుకొనేందుకు అదును కోసం వేచిచూస్తున్న రైతులకు వర్షం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

**ఆత్మకూరులో వర్షం**

**ఆత్మకూరు:** పట్టణంలో మంగళవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఓ మోస్తరు వర్షం కురిసింది. ఇటీవల కురిసిన వర్షాలకు రైతులు పంట పొలాల్లో సేద్యాలు చేసుకుని పలుచోట్ల మొక్కజొన్న, కంది తదితర పంటలను విత్తు వేశారు. అయితే గత వారం రోజులుగా చినుకుజాడ కనిపించకపోవడంతో రైతులు ఆందోళన చెందారు. దీంతో కొందరు రైతులు విత్తు పనులు నిలిపివేశారు. మరో రెండు, మూడు రోజులపాటు వర్షాలు లేకపోయి ఉంటే విత్తనాలు వేసే అవకాశం ఉండేది కాదన్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం వర్షం కురవడంతో రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆత్మకూరు మండలంలో సాధారణ వర్షపాతం 92 మి.మీ. కాగా ఇప్పటి వరకు 140 మి.మీ. వర్షపాతం నమోదయ్యింది. వాగులు, వంకలు ఇప్పటికే పొంగి పొర్లుతున్నాయి. వరదరాజస్వామి ప్రాజెక్టుకు రెండు దిమ్మెల మేర నీరు చేరాయి. సిద్ధాపురం, కరివేన, ఇందిరేశ్వరం చెరువుల్లో వరదనీరు వచ్చి చేరుతుంది. ప్రస్తుతం ఈ వర్షాలకు ఈ ఏడాది చివరినాటికి చెరువు నిండే అవకాశం ఉండడంతో రైతులు విస్తారంగా పంటలను సాగు చేస్తున్నారు.



సంగమేశ్వరం ఆలయం వద్ద వర్షం పడుతున్న దృశ్యం



ఎర్రమఠం గ్రామ సమీపంలో పంటకాలువలో చేరిన నీరు



ఆత్మకూరులో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

### నేడు ఆలయ భూములకు వేలాలు

**మహానంది:** బండిఆత్మకూరు మండలం సింగవరం గ్రామంలోని శ్రీవెంకటేశ్వర, ఆంజనేయస్వామి ఆలయాలకు చెందిన భూములకు బుధవారం వేలాలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి నాగప్రసాద్ తెలిపారు. వెంకటేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన సుమారు 24 ఎకరాలు, ఆంజనేయస్వామి దేవస్థానానికి చెందిన 18 ఎకరాల భూములకు ఏడాది కాల పరిమితికి వేలాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అలాగే బండిఆత్మకూరులోని శ్రీ లక్ష్మీజనార్దన, ఆంజనేయస్వామి ఆలయాలకు చెందిన భూములకు వేలాలు ఉంటాయన్నారు. సుమారు 40ఎకరాలకు పైగా భూములకు జరగనున్న వేలాల్లో రైతులు పాల్గొనాలని కోరారు.

### నీట్ అవకతవకలను నిగ్గు తేల్చాలి

**నంద్యాల(న్యూటౌన్):** వైద్య సీట్ల భర్తీకి నిర్వహించే నీట్‌లో అవకతవకలపై నిగ్గు తేల్చాలని వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రీజనల్ కో ఆర్డినేటర్ సన్నల సాయిరాంరెడ్డి ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ఈ ఏడాది జరిగిన నీట్ పరీక్షలో పేపర్ లికేజీతో పాటు మార్కులు కలపడం వంటివి జరిగిందన్నారు. 24 లక్షల మంది విద్యార్థులు పరీక్షలు రాశారని, ఇలా జరగడం దురదృష్టకరమన్నారు. దీనిపై ప్రధాని, ఆరోగ్యశాఖ మంత్రి స్పందించాలని కోరారు. సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా చూడాలని కోరారు.

## బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి





మిడుతూరులో ర్యాలీ, పగిడ్యాలలో విద్యార్థి అడ్మిషన్ దరఖాస్తును స్వీకరిస్తున్న ఎంఈఓ

**మిడుతూరు :** బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని మిడుతూరు ఎంఈఓ–2 శ్రీనాథ్, కేజీబీవీ ఎస్ఓ విజయలక్ష్మి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాలికా విద్యను అందరూ ప్రోత్సహించాలని దివ్యాంగులు, పిల్లలు అందరూ కూడా బడిలో ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం సాయితిమ్మయ్య, పీఎంసీ చైర్మన్ ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

**హాజరు శాతం పెంచాలి**

**పగిడ్యాల:** ఒకటవ తరగతిలో చేరే విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలని మండల విద్యాధికారి సుభాన్ ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. మంగళవారం బీరవోలు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో నమ్మకాన్ని కలిగించాలని ఒకటవ తరగతి నుంచే ఇంగ్లిష్ మీడియం బోధన ఉంటుందని పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి పాఠశాలలో చేర్పించుకోవాలన్నారు. బడిఈడు పిల్లలందరూ బడిలో ఉండాలని విద్యాహక్కు చట్టం నిబంధనలను పాటించాలన్నారు. అనంతరం మధ్యాహ్నం భోజనంను పరిశీలించి మెనూ ప్రకారం పిల్లలకు పౌష్టికాహారం అందించాలని ఆదేశించారు. ప్రధానోపాధ్యాయులు శివరామయ్య, టీచర్ వాసు తదితరులు ఉన్నారు.

## సీసీఏ రూల్స్‌పై కలెక్టరేట్ ఉద్యోగులకు అవగాహన



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

**నంద్యాల:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల ప్రవర్తన నియమావళి, సీసీఏ, కండక్ట్ రూల్స్‌పై ప్రతి ఉద్యోగి సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి కలెక్టరేట్ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో సీసీఏ రూల్స్, కండక్ట్ రూల్స్‌పై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని సిబ్బందికి పలు సూచనలు చేశారు. జిల్లా రెవెన్యూ అధికారి పద్మజ, అన్ని సెక్షన్ల సూపరింటెండెంట్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగి తన విధుల్లో విరుద్ధంగా ప్రవర్తించినా.. అతిక్రమించినా ఎలాంటి చర్యలు తీసుకోవాలి, విచారణకు అనుసరించాల్సిన విధివిధానాలపై క్షుణ్ణంగా తెలుసుకుని ఫైళ్లను సర్కులేట్ చేస్తే పైఅధికారులకు ఇబ్బందులు ఉండవని సూచించారు. గతంలో సీసీఏ రూల్స్ అతిక్రమించిన సిబ్బందికి విధించిన క్రమశిక్షణ చర్యల దస్త్రాలను పరిశీలించుకోవాలన్నారు. ప్రతి ఉద్యోగి హాజరు వేళలు, హాజరు రిజిస్టర్, కార్యాలయానికి ఆలస్యంగా హాజరవుట, పని వేళల్లో కార్యాలయాన్ని వదిలి వెళ్లిపోవుట, యాదృచ్ఛిక సెలవు, నిర్వహించాల్సిన రిజిస్టర్లు తదితర ప్రాథమిక సూత్రాలు తెలిసి ఉండాలన్నారు.

## పెట్రోలు బంకుల్లో మోసాలపై చర్యలు తీసుకోవాలి



పెట్రోల్ బంకు వద్ద ఆందోళన చేస్తున్న కస్టమర్లు

**నందికొట్కూరు:** పెట్రోల్ బంకుల్లో జరుగుతున్న మోసాలపై వెంటనే అధికారులు చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని పెట్రోల్ బంకు వద్ద ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఇండియన్ పెట్రోల్ బంకులో రూ.180 పెట్రోల్ పోయమంటే రూ.120 పోసి పంపుతున్నారని, యజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ధర్నా చేశారు. పోలీసులు ఆందోళనకారుల వద్దకు చేరుకుని సమస్యను పరిష్కరించారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పెట్రోల్ బంకుల యజమాన్యం దోపిడీని అరికట్టాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదని మండిపడ్డారు. మామూళ్ల మత్తులో అధికారులు మునిగి తేలుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక సార్లు పెట్రోల్ బంకుల్లో కస్టమర్లకు జరుగుతున్న అన్యాయంపై ఫిర్యాదులు చేసినా అధికారులు నిమ్మకునీరేత్తినట్లు వ్యవహరించడం దారుణమన్నారు. సంఘం నాయకులు సోమన్న, రమణ, మధు, భాస్కర్, ఉపేంద్రా, రియాజ్, అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.

### ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

**ఆత్మకూరు:** పట్టణంలోని ఎల్లమ్మ దేవాలయంలో మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద సందడి వాతావరణం నెలకొంది. అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు నిర్వహించారు. భక్తులు బోనాలు సమర్పించి అమ్మవారికి పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

**పాణ్యం:** మండల పరిధిలోని తమ్మరాజుపల్లె గ్రామం వద్ద జాతీయరహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలైనట్లు హైవే సిబ్బంది తెలిపారు. నంద్యాల పట్టణా నికి చెందిన ప్రసాద్ వ్యక్తిగత పనినిమిత్తం కర్నూలుకు వచ్చాడు. పని ముగించుకుని ద్విచక్ర వాహనంపై నంద్యాలకు తిరుగు ప్రయాణమయ్యాడు. మార్గమధ్యలోని తమ్మరాజుపల్లె వద్ద బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. తీవ్ర గాయాలు కావడంతో హైవే అంబులెన్స్‌లో నంద్యాల జీజీహెచ్‌కు తరలించారు.

### రేపు కేంద్ర బృందం పర్యటన

**పాణ్యం:** మండలంలోని తమ్మరాజుపల్లె గ్రామంలో ఈనెల 20వ తేదీ కేంద్రబృందం సభ్యులు పర్యటించనున్నట్లు ఎంపీడీఓ భాగ్యలక్ష్మీ తెలిపారు. నీటి సమస్యలు, కరువు పరిస్థితులను క్షేత్రస్థాయిలో రైతులను అడిగి తెలుసుకోనున్నారని చెప్పారు. కాగా గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నట్లు ఆమె తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్, డీఈఈ మధుసూదన్, ఏఈ మధుశేఖర్‌తో మంగళవారం గ్రామంలో పర్యటించారు. ఓహెచ్ఆర్, బోర్లు, మినీ ట్యాంక్, ఇతర నీటి వనరులను పరిశీలించారు.

## వెంకన్నకు విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

**నంద్యాల(వ్యవసాయం):** స్థానిక సంజీవనగర్‌లోని రామాలయంలో లక్ష్మీవేంకటేశ్వరస్వామికి శ్రీభగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో అష్టాదళ పాదపద్మారాదన సేవ వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే స్వామి వారికి సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం వేదపండితులు 108 బంగారు పుష్పాలతో అష్టోత్తరనామ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో సూరయ్య, శ్రీనివాస్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

## వాల్మీకులకు న్యాయం చేయాలి



మాట్లాడుతున్న వాల్మీకి సంఘం నేత పులికొండన్న

**నంద్యాల(అర్బన్):** వాల్మీకుల ఎస్టీ పునరుద్ధరణ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదం పొందేలా తెలుగుదేశం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎంబీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పులికొండన్న, అధికార ప్రతినిధి పవన్‌గోపాల్ కోరారు. ఆ సంఘం కార్యాలయంలో మంగళవారం ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2017లో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబునాయుడు ఎస్టీ పునరుద్ధరణ బిల్లు పార్లమెంట్‌కు పంపారన్నారు. బిల్లులో సవరణలు చేపట్టాలని కేంద్రం బిల్లును వెనక్కి పంపిందని, 2024లో మరోమారు రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వాల్మీకులకు న్యాయం జరిగేలా పునరుద్ధరణ బిల్లును ఆమోదింపజేయాలని కోరారు. నాయకులు జయరాం, మధుగోపాల్, రాజునాయుడు తదితరులు పాల్గొన్నారు.

## కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలి

**నంద్యాల(న్యూటౌన్):** డీఎస్సీ పేరుతో నిరుద్యోగులను మోసం చేస్తున్న కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ నాయకులు శివ, వంశీ అధికారులను కోరారు. డీఎస్సీ నోటిఫికేషన్ రావడంతో దీన్ని ఆసరా చేసుకుని పలు కోచింగ్ సెంటర్ల యజమానులు ఎంతో మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించామంటూ మభ్యపెడుతూ అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. సరైన ఫ్యాకల్టీ లేక నిరుద్యోగులు నిరాశ పడుతున్నారన్నారు. నిరుద్యోగులను మోసం చేస్తున్న కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## లోక్ అదాలత్‌ను విజయవంతం చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న ఐదవ అదనపు జిల్లా జడ్జి ఆర్‌వీవీఎస్ మురళీకృష్ణ

**ఆళ్లగడ్డ:** జాతీయ లోక్ అదాలత్ జాతీయ ఈ నెల 29వ తేదీన నిర్వహించనున్నందున విజయవంతం చేసేందుకు అందరం సమిష్టిగా కృషి చేద్దామని ఆళ్లగడ్డ ఐదవ అదనపు జిల్లా జడ్జి ఆర్ వీవీఎస్ మురళీకృష్ణ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కోర్టు హాలులో పోలీసు అధికారులు, న్యాయవాదులుతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకం చేపడుతున్న లోక్ అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కరించడమే లక్ష్యంగా పోలీసులు, న్యాయవాదులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. పెండింగ్ సివిల్, రాజీపడదగిన క్రిమినల్ కేసులతోపాటు వాహన ప్రమాదం, చెక్‌బౌన్స్, కుటుంబ తగాదాలు తదితర కేసులను పరిష్కరించుకోవచ్చని, ఇరువర్గాలకు అవగాహన కల్పించాలని సూచించారు. కక్షి దారులకు ఏదేని సందేహాలు ఉంటే మండల న్యాయ సేవా సంఘాన్ని సంప్రదివచ్చని సూచించారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ డీఎస్పీ షర్ఫుద్దీన్, సీఐలు రమేష్‌బాబు, హనుమంత నాయక్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సూర్యనారాయణరెడ్డి, సీనియర్ న్యాయవాది సోమశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలి



యాజమాన్య పద్ధతులను వివరిస్తున్న వ్యవసాయాధికారిణి హేమలత

**పాములపాడు:** పొలాల్లో భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా ఎరువులు వాడుకోవాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారిణి హేమలత అన్నారు. మంగళవారం స్థానిక ఆర్బీకేలో రైతులతో ఖరీఫ్‌కు సాగుకు సమాయత్తం కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సమగ్ర పోషక యాజమాన్యంలో భాగంగా పంట సాగుకు ముందు పచ్చి రొట్ట వాడకం గురించి వివరించారు. విత్తనం నాటడానికి ముందు విత్తన శుద్ధి తప్పక చేయాలన్నారు. వివిధ పైర్లు వాటిలో సోకే తెగుళ్ల, నివారణల గురించి తెలియజేశారు. అలాగే పంటలకు ఆశించే పురుగులు యాజమాన్య పద్ధతులను తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఫణీశ్వరరెడ్డి, వ్యవసాయ సహాయకురాలు గాయత్రి, ఎంపీఈఓ ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

### మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు ఆహ్వానం

**గోస్పాడు:** స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో ఖాళీగా ఉన్న సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్కూల్ ప్రిన్సిపాల్ ఖాజాహుసేన్ తెలిపారు. 7వ తరగతిలో ఒకటి, 8వ తరగతిలో రెండు, 9వ తరగతిలో రెండు సీట్లు ఖాళీగా ఉన్నట్లు చెప్పారు. ఈ నెల 22వ తేదీ లోగా గోస్పాడులోని మోడల్ స్కూల్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 24వ తేదీ స్కూల్‌లో ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

## పిడుగుపాటుకు గొర్రెల మృతి



పిడుగుపాటకు చీలిన చింత చెట్టు



మృతి చెందిన గొర్రె

**రుద్రవరం:** మండలంలో మంగళవారం తెల్లవారు జామున ఉరుములతో భారీ వర్షం కురిసింది. పెద్దశబ్దంతో గ్రామంలోని చింత చెట్టుపై పిడుగు పడింది. పిడుగుధాటికి చింత చెట్టు పైనుంచి కింద వరకు చీలింది. చింతచెట్టు కింద సేదతీరుతున్న రైతు వెంకటేశ్వర్లుకు చెందిన రెండు గొర్రెలు, రెండు మేకలు, మరో రెండు చిన్న పిల్లలు మృత్యువాత పడ్డాయి. దాదాపు రూ.60వేల వరకు నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయాడు. పశువైద్యాధికారి మనోరంజన్ ప్రతాప్ మృతి చెందిన జీవాలకు పోస్టుమార్టం నిర్వ హించారు.

## కూరగాయల ధరలు తగ్గించాలి



మాట్లాడుతున్న ఎ.రణధీర్

**ఆత్మకూరు:** వర్షాకాలం ప్రారంభంలో కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటాయని, వెంటనే ధరలను తగ్గించాలని సీపీఎం పార్టీ పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్, పట్టణ నాయకులు డి.రామ్‌నాయక్, సురేంద్రలు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం వారు స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ అధిక ధరలు వెచ్చించి కొనలేక సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇళ్లల్లో ప్రతిరోజూ వాడే సబ్బులు, నూనెలు, గోధుమపిండి తదితర నిత్యావసర వస్తువుల ధరలు కూడా పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ధరలను వెంటనే తగ్గించాలన్నారు. ప్రస్తుతం మార్కెట్లో పచ్చిమిర్చి కేజీ రూ.120, టమాట కేజీ రూ.60, ఉల్లిగడ్డలు కేజీ రూ.50పైనే పలుకుతున్నాయన్నారు.

### అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

**నంద్యాల(న్యూటౌన్):** అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏసురత్నం, నాగరాజు కోరారు. మంగళవారం నంద్యాలలోని సీఐటీయూ కార్యాలయంలో సేబారాణి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కార్యకర్తలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కల్పించి సగం పెన్షన్ ఇవ్వాలని కోరారు. అంగన్‌వాడీ సెంటర్లకు ట్రాన్స్‌పోర్టు చార్జీలు, మెను చార్జీలు పెంచాలన్నారు. సమావేశంలో నిర్మలమ్మ, వెంకటలక్ష్మి, రమణమ్మ, సునీత, నాగరాణి, సరస్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.



ప్రకృతి అందాల నడుమ మహానంది ఆలయం

## మంచుకురిసి.. ప్రకృతి పరవశించి!

**మహానంది:** నల్లమలలో వెలసిన మహానంది ఆలయం మహానందానికి నిలయం. ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్న మహానంది పుణ్యక్షేత్రం పరిసరాలు వరుసగా కురుస్తున్న వర్షాలతో పచ్చగా కళకళలాడుతూ భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. దీంతో పాటు ఉదయం వేళలో మంచు కురుస్తుండటంతో ఊటిని తలపిస్తోంది.